క్లుప్తంగా

కేజీబీవీలో వసతుల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల వసతులు, వంటగది, ఆహార పదార్థాలను విలేజ్ హెల్త్ క్లీనింగ్ సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. మరుగుదొడ్ల శుభ్రత, బాలికల కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిశరత్‌రెడ్డి

గూడూరురూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే పీహెచ్‌పీ సభ్యులు ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ ఎం.సాయిశరత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల విశ్రాంత భవనంలో మంగళవారం నాయుడుపేట, గూడూరుకు చెందిన కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులకు సాయిప్రియ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్సతో ప్రమాదాల బారినపడిన వారు ప్రాణాలు కోల్పోకుండా ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ ప్రియాంకరెడ్డి చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, శేషయ్య, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, సుభాస్ చంద్రబోస్, సాయిమురళి, శంకరమ్మ, ఖలీల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై సర్వే



గ్రామస్తులతో మాట్లాడుతున్న వీఆర్‌ఓ

చిల్లకూరు: మండల కేంద్రంలో శ్మశాన స్థలాన్ని ఆక్రమించి పక్కనే ఉన్న లేఅవుట్‌లో కలిపేశారని గ్రామస్తులు రెండు రోజుల క్రితం తహసీల్దార్ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం రెవెన్యూ అధికారులు శ్మశానం వద్దకు చేరుకుని గ్రామస్తుల ఎదుట సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. అయితే పక్కనే ఉన్న పట్టా భూమిని కూడా ప్రభుత్వ భూమిగా గుర్తించే సరికే భూమిపై హక్కులు ఉన్న వారు అక్కడకు చేరుకుని స్వాతంత్య్రం రాక పూర్వం తమకు రిజిస్ట్రేషన్ చేసిన పొలాల్లో ఇటీవల సాగు చేయకుండా వదిలి వేస్తే ప్రభుత్వ భూమి కింద లెక్క కట్టడం ఏమిటని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. హక్కుకు సంబంధించిన పత్రాలను తహసీల్దార్ వద్దకు తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని వారి కి నచ్చచెప్పి పంపేశారు. వీఆర్‌ఓ రమణయ్య, సచివాలయ సర్వేయర్ తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలచ్చూరులో పారిశుధ్య పనులు



మురుగు కాలువలో పూడిక తీస్తున్న సిబ్బంది

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు పంచాయతీ పరిధిలోని కప్పగుంటకండ్రిగ, దిరసనమాల, జంగాలపల్లి, పాలచ్చూరు గ్రామాల్లో సిబ్బంది మంగళవారం పారిశుధ్య పనులు చేశారు. నివాసాల మధ్య చెత్తాచెదారాన్ని తొలగించారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి బ్లీచింగ్ వేశారు. తాగునీటి బోర్లు, కొళాయిల వద్ద బ్లీచింగ్ వేశారు. పంచాయతీ కార్యదర్శి వసంత్‌కుమార్ పనులను పర్యవేక్షించారు.

20న చలో రాజమండ్రి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

సైదాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించేందుకు ఈనెల 20న చలో రాజమండ్రి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీపీ పోలయ్య తెలిపారు. సైదాపురంలో మంగళవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతుల పంట గిట్టుబాటు ధరలపై అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గురుకులం..అస్తవ్యస్తం

- గురుకులాల్లో విద్యార్థులకు రక్షణ కరువు
- సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్న పిల్లలు
- కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలు, కోటలో ఒక బీసీ గురుకులం, గూడూరులో ఒక ఎస్టీ బాలికల గురుకులం, చెన్నూరులో ఒక ఎస్టీ గురుకుల పాఠశాల ఉన్నాయి. వీటిలో ప్రతి పాఠశాలలో 400 మందికి తక్కువ కాకుండా విద్యార్థులు చదువుతూ అక్కడ వసతి పొందుతున్నారు. అయితే వీరికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నానా తిప్పలు పడుతున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడంలో పెరిగిపోతున్న ధరలకు అనుగుణంగా సరుకులు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆరంభంలోనే ప్రభుత్వం విద్యార్థులకు ఎలాంటి అవసరాలు ఉన్నాయనే విషయాలను అంచనా వేసి ఆటు తరువాత ఆరంభించి ఉంటే విద్యార్థులకు ఇబ్బందులు తప్పి ఉండేవి. అలాగే కొంతమంది అధ్యాపకులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్స్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. చిల్లకూరులో 550 మంది విద్యార్థులు ఉండగా వారికి వడ్డించే వంటగదితో పాటు విద్యార్థులకు తాగునీరు అందించే ఆర్వో ప్లాంట్‌కు నీటిని సరఫరా చేసే ట్యాంకు శిథిలావస్థలో ఉంది. దీనిని శుభ్రం చేసేందుకు ప్రయత్నిస్తే ఎక్కడ కూలుతుందోనని అలాగే వాడుతున్నారు.



కోటలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్

పాచి పట్టి కొళాయిలు ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. అలాగే కోటలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు తాగునీటిని అందించే ఆర్వో ప్లాంట్ గత ఏడాది పాడైపోవడంతో విద్యార్థులు కొళాయిల నుంచి వచ్చే నీటిని తాగాల్సి వస్తోంది. అలాగే వాకాడులోని గురుకుల పాఠశాలలో పారిశుధ్యం మెరుగు పడకపోవడంతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని రెండు వారాలకు ఒకసారి పిల్లలను చూసేందుకు వెళ్లే తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించే ఆర్వో ప్లాంట్ కూడా లేకపోవడంతో కొళాయిల్లో నీరే తాగాల్సి వస్తుంది. స్నానాలు కూడా ఆరుబయట చేస్తున్నారు. ఇటీవల గూడూరు మండలం చెన్నూరులోని ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు గురుకుల పాఠశాలతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులకు భద్రత కల్పించడం, వారికి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వాకాడులో విద్యార్థులు తినలేక బయట పడేసిన భోజనం

పరిమితికి మించి ఉండడంతోనే..



నా మనవళ్లు ఇద్దరిని నాయుడుపేట గురుకుల పాఠశాలలో చేర్పించా. పాఠశాలలో ప్రతి తరగతిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో గదులు చాలడం లేదు. వసతులు సరిగ్గా లేవు. రెండు రోజుల కిందట మనవళ్లు ఇద్దరికి విరేచనాలు అయ్యాయి. ఇద్దరిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించా. ఇదీ గురుకుల పాఠశాల పరిస్థితి.

వెంకటేశ్వర్లు, ఉడతావారిపాళ్లపల్లి, చిల్లకూరు మండలం

భయమేసింది..



నా మనవడు గూడూరు ఆస్పత్రిలో చేరాడని చెప్పడంతో భయమేసింది. నా కూతురు బిడ్డను నాయుడుపేట గురుకుల పాఠశాలలో చేర్పించారు. పాఠశాలలో మురుగు ఎక్కువగా ఉంది. పిల్లలు ఎక్కువ మంది కావడంతో వారికి సరిపడా బాత్రూంలు లేవు. దీంతో పరిశుభ్రత కరువైంది. అధికారులు పట్టించుకోవాలి.

పుల్లమ్మ, తుమ్మూరు, నాయుడుపేట మండలం

చెప్పినా పట్టించుకోరు..



బిడ్డను గురుకుల పాఠశాలలో చేర్పించా. అక్కడ పరిస్థితులపై పలుమార్లు ప్రిన్సిపల్, అయ్యోర్లకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోలేదు. బిడ్డలు శుభ్రంగా ఉండేలా కూడా చూడరు. బిడ్డను చూడడానికి వెళ్లినపుడు మేము తీసుకుపోయిన భోజనం పెట్టి రావల్సి వస్తుంది. బడిలో చేర్పించిన నాటి నుంచి ప్రతి ఆదివారం బిడ్డను చూసి వస్తున్నాం. అధికారులు పాఠశాల వసతులపై దృష్టిపెట్టాలి

చెంగయ్య, వెడిచెర్ల, గూడూరు మండలం

గురుకుల పాఠశాలను పర్యవేక్షిస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్



గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

డక్కిలి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతిరోజూ రెండు దఫాలుగా పాఠశాలను పరిశీలిస్తామన్నారు. విద్యార్థులు ధైర్యంగా చదువుకోవాలని సూచించారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అదేవిధంగా డక్కిలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. వైద్యాధికారిణి బిందు ప్రియాంక, ఆర్‌ఐ రాజేష్, వీఆర్వోలు మోహన్, విజయ్‌కుమార్, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ దృష్టికి గురుకులం సమస్యలు

సూళ్లూరుపేట: జిల్లా పరిధిలో వున్న అన్ని గురుకుల పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, ఇక్కడ చదివే విద్యార్థులకు కలుషితమైన ఆహారం, నీళ్లు ఇస్తున్నారని, ఈ పద్ధతి మారాలని తిరుపతి జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి సి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రకు వినతిపత్రాన్ని ఇచ్చారు. అయన మాట్లాడుతూ మంగళవారం గురుకుల పాఠశాలలో సౌకర్యాలపై పరిశీలిస్తున్న సమయంలో జేసీ అక్కడికి రావడంతో సమస్యలను అయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గురుకుల పాఠశాల సిబ్బంది, అధికారులు నిర్లక్ష్య వైఖరి విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపించి దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్‌చంద్, స్థానిక నేతలు సురేష్, తేజ పాల్గొన్నారు.



జేసీకి వినతి పత్రం ఇస్తున్న నేతలు

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించండి

నాయుడుపేటటౌన్: గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, నాయుడుపేట గురుకులంలో జరిగిన సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు.పట్టణంలోని దర్గా సర్కిల్ వద్ద విద్యార్థులతో కలసి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాదర్శి భగత్‌రవి, ఎస్ఎఫ్ఐ నేతలు గణేష్, మనోజ్, విష్ణు, ప్రసాద్, సీఐటీయూ నేత ముకుందా పాల్గొన్నారు.



నాయుడుపేటలో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల నిరసనలు

ఆశా వర్కర్‌పై కక్ష సాధింపు తగదు

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశా వర్కర్ కస్తూరి కృష్ణవేణిపై రాజకీయ కక్ష సాధింపులు తగవని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య పేర్కొన్నారు. బాలాయపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ బాలాయపల్లి కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన ఆశా వర్కర్ కృష్ణవేణిపై రాజకీయకక్షతో ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఇకనైనా కృష్ణవేణి తొలగింపు చర్యలు మానుకోవాలని, లేకుంటే తమ సంఘాల తో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నేతలు

అనుమానితుడని చంపేస్తారా?

పెళ్లకూరు: చోరీ కేసులో అనుమానితుడుగా భావించి అదుపులోకి తీసుకున్న శ్రీనివాసులును లాఠీలతో కొట్టి చంపేస్తారా అంటూ పోలీసుల తీరుపై చింతపూడి దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారు సరుడు చోరీకి కారకుడంటూ చింతపూడి గ్రామం, దళిత కాలనీకి చెందిన శ్రీనివాసులును అనుమానించి ఈనెల 9న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని వారం రోజులకుపైగా నాయుడుపేట సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లు తిప్పుతూ కొట్టారు. దీంతో శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితి విషమించడం వల్ల నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అమాయకుడిని స్టేషన్‌కి తీసుకొచ్చి కొట్టి చంపేస్తారా అంటూ శ్రీనివాసులు కుటుంబ సభ్యులు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు.

నేడు పెంచలకోనలో ఏకాదశి వేడుకలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తొలి ఏకాదశి నాడు శ్రీమన్నారాయణుడు యోగ నిద్రకు ఉపక్రమించాడని అందుకు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి అంత్రాలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పాలసముద్రంలో యోగ నిద్రలో ఉన్నట్లుగా శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం

వాకాడు: వాకాడు మండలం రెడ్డిగారిదిబ్బ గిరిజన కాలనీకి చెందిన చింతపూడి నాగమ్మ మృతిచెందడంతో ఆ కుటుంబానికి మంగళవారం స్వర్ణసాగరం ఫౌండేషన్ వారు ఆర్థికసాయం అందజేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ కర్మక్రియల ఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ చైర్మన్ దామా విజయకుమార్ సాయం అందజేశారన్నారు. దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, మారం రెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గేదె దూడపై కుక్క వీరంగం



గాయపడ్డ గేదెకు చికిత్సచేస్తున్న పశు వైద్యులు

బాలాయపల్లి(సైదాపురం): పొలంలో మేత మేస్తున్న గేదె దూడపై కుక్క వీరంగం చేసి గాయపరిచింది. ఈ ఘటన బాలాయపల్లి మండలంలోని కడగుంట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కడగుంట గ్రామానికి చెందిన ఒప్పతొట్టి రవికి చెందిన పాడి రైతు గేదె దూడ వ్యవసాయ పొలంలో మేత మేస్తోంది. ఆ సమయంలో కుక్క దాడిచేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం బాలాయపల్లి పశువైద్యశాలకు తరలించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోండి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని ప్యానల్ న్యాయవాది గాంధీ తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు మంగళవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, స్థానిక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్, లోక్‌అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 6.303 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి లోకనాథం

చిల్లకూరు: నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లోకనాథం కార్మికులకు సూచించారు. మండలంలోని అపెక్స్ బూట్ల పరిశ్రమలో మంగళవారం కార్మికులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ ప్రతి పౌరుడు కొన్ని ప్రాథమిక చట్టాలను గౌరవించాలని అన్నారు. ప్రతిఒక్కరూ ఒకరిని ఒకరు గౌరవించుకునేలా ప్రవర్తించాలని, అప్పుడే స్నేహపూరితమైన వాతావరణం ఉంటుందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా చిన్న సమస్యలతో పోలీస్‌స్టేషన్‌లకు వచ్చి కేసులు పెట్టుకుంటూ ఉంటారని అలాంటి వాటిని సమయస్ఫూర్తిగా పరిష్కరించుకునేందుకు రాజీమార్గం ఉందని ఇదే లోక్ అదాలత్ అని అన్నారు. ఎస్ఐ సుధీర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

వెంకటగిరిరూరల్: రైతులు పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టడంపై అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషివిజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు పేర్కొన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిమ్మసాగుపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిమ్మసాగులో రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వాడుకోవాలన్నారు. ఆత్మ డీపీడీ శివనారాయణ మాట్లాడుతూ వేరుకుళ్లు నివారణ తెగుళ్లపై ట్రికోడర్మ విరిడీ అనే జీవన సిలేంద్ర నాశిని ఉపయోగించుకోవాలన్నారు. ఆత్మ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ యువతకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడీఏ నాగార్జునసాగర్, పెట్లూరు నిమ్మ శాస్త్రవేత్త మధుమతి, రీజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నాగార్జునరెడ్డి, రాజీవన, విజయశ్రీ, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ గోవిందరాజులు

విద్యార్థులను పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నాయుడుపేట గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కలుషిత ఆహారం తీసుకోవడంతో అస్వస్థతకు గురై పరిస్థితి విషమంగా వుండడంతో వీరిని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న జిల్లా జెడ్పీ చెర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మంగళవారం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న 14 మంది విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని వారికి మెరుగైన వైద్యం అందజేయాలని సూచించారు. అధైర్య పడవద్దని విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చారు.

తనిఖీలు నిర్వహించాలి..

జిల్లాలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, వంట శాలలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుఏకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల పాఠశాల విద్యార్థులను ఆయన పరామర్శించారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

రేపటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం నుంచి నాలుగు రోజులపాటు గురుపూర్ణిమ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద ఉత్సవాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. 18, 19, 20 తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 21వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా బాబాకు ప్రత్యేక అభిషేక పూజలు అనంతరం బాబా నగరోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబా కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలంలోని చిలమనూరు, పిగిలాం పంచాయతీల్లో ఎంపీడీఓ అరుణ పర్యవేక్షణలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులను చేశారు. ఎంపీడీఓ అరుణ ఆ గ్రామాలకు చేరుకుని జరుగుతున్న పనులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహిస్తుండాలన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఘనంగా మొహర్రం వేడుకలు

వాకాడు: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొహర్రం ముగింపు సందర్భంగా ముస్లిం మత పెద్దలు పీర్లను దర్శించుకుని చావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే పీర్లను గ్రామంలో ఊరేగించారు. చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశం చేసి మతాలకు అతీతంగా మొక్కులు తీర్చుకున్నారు.



పర్వతరెడ్డి సుజాతమ్మ నేత్రదానం



సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలో నేత్రదాన ఉద్యమాన్ని మహోద్యమంలా నిర్వహిస్తున్న ఆచార్య భరద్వాజ సేవా సంస్థకు మండలంలోని గోపాల్‌రెడ్డి పాళెంకు చెందిన పర్వతరెడ్డి సుజాతమ్మ (63) మంగళవారం మృతిచెందడంతో ఆమె కుటుంబసభ్యులు సుజాతమ్మ నేత్రాలను దానం చేశారు. ఆమె మరణానంతరం వారి కుటుంబసభ్యుల ఆమోదంతో నేత్రాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు పంపించారు. ఈ సంస్థలో 438వ నేత్ర దాతగా సుజాతమ్మ నమోదయ్యారు. సంస్థ ప్రతినిధులు మన్నెముద్దు చంద్రబాబు ఆమె మృతికి వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

- రొట్టెల పండగ నేపథ్యంలో వాహనాల మళ్లింపు

నెల్లూరు(క్రైమ్): బారాషహీద్ దర్గాలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు రొట్టెల పండగ జరుగనుంది. దేశ, విదేశాల నుంచి భక్తులు విచ్చేస్తారు. ఈ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో 580 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో ట్రాఫిక్ విధులు నిర్వహించనున్నారు.



ఏర్పాటు చేసిన బారికేడ్లు

పార్కింగ్ ప్రదేశాలివే..

- బెంగళూరు, చెన్నై, తిరుపతి వయా గూడూరు మీదుగా వచ్చే వాహనాల కోసం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, జీజీహెచ్ (జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రి) ప్రాంగణంలో, డీ మార్ట్ సమీపంలోని సైన్స్ పార్కు వద్ద పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు.

బుధవారం ఉదయం 7 గంటల నుంచి ట్రాఫిక్ డైవర్షన్లను అమలు చేయనున్నారు.